# ఆవిడమ్మ

– మోహనకృష్ణ ఇంద్రగంటి

ఈ ఊళ్ళో ఓ పేటలో సందు మూల ఒక చిన్న డాబా ఇల్లుంది. డాబా అన్నంత మాత్రాన పూర్తిగా డాబా కూడా కాదు. పిట్ట గోడలు సగం కట్టి వదిలేసిన డాబా ఇల్లు అది. ఇంకా పొడుగ్గా ఇనుప ఊచలు గాల్లో నిలబడి గాలొచ్చినప్పుడు ఊగుతూ, వర్షం వచ్చినప్పుడు తడిసి మెరుస్తూ, ఎండల్లో నిటారుగా నిలబడీ కనబడతాయి ఆ డాబా మీద. ఒక అంచు వెంబడి, కొద్దిగా పగిలి బయటికి ఎర్ర, నల్ల మట్టి కనబడే పూలకుండీలూ, వాటిలో మొక్కలూ. ఇంటి రంగు మాసిన తెలుపు.

ఆ ఇంటిని ఆవిడమ్మ గారి ఇల్లు అంటూంటారు ఆ పేటలో వాళ్ళు. ఆవిడ పేరు ఎవరికీ తెలీదులా ఉంది. కథ రాయడానికి పేరుండాలి కదా అని ఎంత ప్రయత్నించినా దొరకలేదు. ఆవిడ పేరు – చిన్నప్పుడు ఆవిడ, ఇప్పుడు ఆవిడమ్మ అనుకుందాం మరి.

ఆ ఇల్లు నాలుగ్గదులది, వసారాతో కలిపి. వసారాలకి లతల గ్రిల్లుంటుంది. ఆ గ్రిల్లుకి కూడా ఏదో లత చుట్టుకునే ఉంటుంది. ఒక్కొక్కప్పుడు పూలుంటాయి. ఒక్కొక్కప్పుడు ఉండవు. ఆ ఇంట్లో ఆవిడమ్మ ఒక్కర్తే ఉంటుంది. సాధారణంగా బయటకి రాదు. పొద్దున్నే నడకకి వెళ్ళొస్తుంది. అరవై ఐదేళ్ళైనా చకచకా నడుస్తుంది. ఆవిడ ముఖం మెరుస్తూంటుంది. ఎప్పుడూ చెరగని చిరునవ్వు. ఎప్పుడూ కాస్త చెదిరిన తెల్ల బొట్టు. మళ్ళీ సాయంకాలం బయటకొచ్చి మొక్కలకి నీళ్ళు పోసి, డాబా మీద కుర్చీ వేస్కుని కూర్చుని పుస్తకం చదువుకుంటుంది. రేడియో వింటుంది. చీకటి పడగానే లోపలి కెళ్ళిపోతుంది. పదింటికల్లా ఆవిడింట్లో లైట్లు ఆరిపోతాయి.

చెప్పే ముక్కేమిటంటే, ఆవిడమ్మ పెళ్ళి చేస్కోలేదు. ఆవిడ ఒంటరి జీవి. కానీ, హాయిగా ఉంటుంది. ఆనందంగా కనబడుతుంది. పెద్దగా చుట్టాలూ స్నేహితులూ ఉన్నట్టు కూడా కనబడరు. వింతే మరి!

ఆవిణ్ణి కలిసి ఆవిడ కథ చెప్పమనడానికి భయమేసింది. కానీ చుట్టుపక్కల ఆవిడ వయసువాళ్ళు, ఒకప్పుడు ఆమెని ఎరిగిన వాళ్ళు (ఆశ్చర్యం, వాళ్ళెవరికీ ఆవిడ పేరు తెలీదు!) చాలా విషయాలు చెప్పారు. కొందరు ఆమె వింత మనిషి (తిక్కది) అన్నారు. కొందరు అదోరకం మనిషి (పిచ్చిది) అన్నారు. మరికొందరు 'అబ్బో' (వ్యవహారాలు నడిపే రకం) అన్నారు. కొందరు 'ఛీ' (మదపిచ్చిది) అన్నారు. కొందరు మాత్రం బలే మనిషి (మాకర్థం కాదు) అన్నారు. కొందరు మాత్రం "పాపం మంచావిడ" అన్నారు. ఇలా రకరకాలుగా – ఇంకా చాలా విన్నాను గానీ చెప్పడం కుదరదు. విన్న కథలు, అభిప్రాయాలు, ఆశ్చర్యార్థకాలు ఓ రోజు ఒళ్ళో పోసుకుని వెళితే చివరికి ఇదీ తెలిసింది.

ఆవిడమ్మకి చిన్నప్పట్నించీ కోప్పడ్డం, ఏడవడం అంటేనే తెలీదుట. పుట్టినప్పట్నించీ నవ్వుతూనే ఉండేదట. చిన్న పాపాయిగా ఉన్నప్పుడు ఓసారి పక్కింటి పిల్ల ఎత్తుకుని పడేస్తే ఆవిడమ్మ కితకితలు పెట్టినట్టు నవ్విందట. వాళ్ళమ్మ భయపడి 'ఇదేమిటి మగరాయుడి బుద్ధులు' అని డాక్టరు దగ్గరికి తీస్కెళ్తే డాక్టరు తిట్టిపోశాట్ట. "అందరు తల్లులూ మా పిల్లలు ఒకటే ఏడుస్తున్నారూ అదీ ఇదీ అంటుంటే మీరేమిటమ్మా! అసలే ప్రాక్టీసు లేక ఏడుస్తుంటే," అన్నాట్ట.

కాస్త పెద్దయ్యాక కూడా ఆవిడమ్మ ఎప్పుడూ దేని గురించీ తల్లిదండ్రుల్ని ఏడిచి గీపెట్టలేదు. ఏదిస్తే అది తీసుకునేది. స్కూల్లో కూడా ఎవ్వరితో పోట్లాట పెట్టుకునేది కాదు. ఒకట్రెండుసార్లు తోటిపిల్లలు అల్లరిగా కొట్టినా, కంగారుపడి వాళ్ళేడిచార్టగానీ, ఆవిడమ్మ మాత్రం, ఊహూ! చదువు కూడా ఫర్వాలేదు ఆవిడమ్మది. ఫస్టు క్లాసులో పాసైందిట. నాన్న కాలేజీలో చేర్పించాడు

(చెప్తే విన్నాడు కాదు, మూర్ఖపు ముండా కొడుకు, అనేది ఆవిడ తల్లి బతికున్నన్నాళ్ళు). కానీ నాన్నకి కాస్త ముందు చూపెక్కువ. 'చదువుకున్న అమ్మాయిలనే కోరుకుంటారు ముందు ముందు మగాళ్ళు' అనే వాడాయన. ఆయన లాజిక్కు ఇది – "అబ్బాయిలు చదువుకున్న అమ్మాయిల్ని కోరుకుంటున్నారు. చదివిద్దాం. ఒకవేళ అబ్బాయికి చదువొద్దనుకో అమ్మాయిని ఇంట్లోనే ఉండమందాం. అమ్మాయికి చాయిస్సుంది – పెళ్ళి, లేకపోతే ఉద్యోగం. మగాడికి పెళ్ళికి ముందూ తర్వాత కూడా ఉద్యోగమే! హ్హహ్హహ్హ".

కానీ నాన్న ఆవిడమ్మని తప్పుగా అంచనా వేశాడు. ఆయన గుక్క తిప్పుకునే లోపల ఆమె బియ్యే, ఎమ్మే, పి. హెచ్‌డి చేసి చిద్విలాసంగా కూర్చుంది. "ఇప్పుడు దీనికి పెళ్ళెలా?" అంది తల్లి. "చూద్దాంలే" అన్నాడు నాన్న.

సరిగ్గా ఇక్కడే ఆవిడమ్మ తన అసలు రూపాన్ని ఆవిష్కరించింది.

"అక్కర్లేదు" అంది ఆవిడమ్మ.

ఇద్దరూ (తల్లీ, తండ్రీ) వింతగా, విసుగ్గా చూశారు.

"నోర్ముయ్యి" అంది తల్లి.

"వాజ్‌పేయ్‌లా ఒంటరిగా ఉండిపోతావా," వంకరగా నవ్వాడు నాన్న.

"నాకు ఉద్యోగం వచ్చింది. ఫలానా కాలేజిలో"

"ఓసినీ"

"జీతమెంత?"

"నేను వేరేగా ఇల్లు తీస్కుందామనుకుంటున్నా." అంది ఆవిడమ్మ.

"ఏమిటీ!"

"పిచ్చా, వెర్రా"

"ఓ ఇల్లు కూడా చూశాను" అంది ఆవిడమ్మ.

"మేమేమన్నా చచ్చిపోయామా!"

"అసలే ఒక్కర్తివే పిల్లవి... హు హు"

"కని, పెంచీ, పోషించీ, చదువు చెప్పించీ, అంత సొతంత్రం ఇచ్చీ... ఇదేనా నువ్విచ్చేది"

"రాతి గుండె, ముండది"

"పుట్టినప్పట్నించీ ఇంతే! రాయి మొహం, రాయి మనసు!"

"మగపిల్లాడు పుట్టినా పోయేది. వద్దు వద్దంటే ఆపరేషను..."

కానీ ఆవిడమ్మ ఏం మాట్లాడలేదు. ఒకటే మాటంది.

"ఎందుకే అమ్మా రాద్ధాంతం! నేనిప్పుడేం చేశాననీ!"

అది ప్రశ్నలా అనలేదు. అంది అంతే.

వారం తర్వాత ఇల్లు మారింది. రోజు విడిచి రోజు అమ్మా నాన్ననీ పలకరించేది. ఇంటికెళ్ళి పోయేది.

అసలిక్కణ్ణించే ఆవిడమ్మ కథ ఇంకా భలేగా ఉండేది.

ఆవిడమ్మకి ప్రేమ అంటే ఏమిటో తెలీదుట. ప్రేమించడం, ప్రేమించబడడం అంటే అస్సలు అర్థం కాదుట. ఏమిటో అలా ఉండేదిట. అలాంటి ఆవిడమ్మని నాగరాజు ప్రేమించాడు. నాగరాజు ఆవిడమ్మ కాలేజిలో తోటి లెక్చరర్. ఆవిడమ్మ అందాన్ని మొదటిసారిగా చూశాడు నాగరాజు. ఆమెలోని సొగసు చూసి దాసుడైపోయాట్ట. ఆమె వ్యక్తిత్వం చూసి ముగ్ధుడైపోయాట్ట. జ్వర పీడితుడిలాగా అల్లల్లాడి పోయాట్ట. నానా అవస్థలూ పడి ఓ రోజు ఆవిణ్ణి కలిసి మనసులో విషయాన్ని చెప్పాట్ట. ఆవిడమ్మ వింతగా చూసిందట. "నేనెందుకింత నచ్చాను" అని ఆవిడ చూసినట్టనిపించి నాగరాజు ఆవిడ గుణాలన్నీ వల్లె వేశాట్ట.

ఆవిడమ్మకి నాగరాజు నవ్వు నచ్చినట్టుంది.

## సోకు

స్వాతంత్ర్యం
ప్రజలు
ఆర్జించిపెట్టుకున్న ఆస్తి
నాయకులు
విచ్చలవిడిగా ఖర్చు పెట్టుకుంటున్నారు.

– వై.కె. మూర్తి

బుగ్గలో సొట్ట నచ్చినట్టుంది. కళ్ళలో మెరుపు నచ్చినట్టుంది. కళ్ళు దించుకుని మాట్లాడే తడబాటు నచ్చినట్టుంది. అందుకే ఆవిడమ్మ అందంగా నవ్విందిట.

పెళ్ళి అన్న మాటే రాలేదుట. ఆవిడమ్మ అడగలేదు. నాగరాజు (యాహూ!) అస్సలు అడగలేదు. శృంగారంలో నాగరాజు ఆవిడమ్మ ప్రావీణ్యం చూసి కంగారు పడ్డాట్ట. 'ఇవన్నీ ఎలా తెలుసు' అనుకున్నాట్ట. ఎక్కడో, చిన్నగా - ఒకటో, రెండో అనుమానాలు... కానీ "ఛి ఛీ, తప్పు'' అనుకుని తొక్కేశాడు వాటిని. "కొంతమందికి సహజంగా... కొన్ని విషయాల్లో టాలెంట్ ఉంటుంది" అనుకున్నాడు.

జీవితం హాయిగా గడిచిపోతోంది. కాలేజీలో, ఊళ్ళో ఏవేవో అంటున్నారని తెలిసినా ఆవిడమ్మ అస్సలు ఏమీ అనేది కాదుట. ఆవిణ్ణి అడగటానికి మాత్రం అందరికీ చచ్చే భయం.

నాగరాజే ఇబ్బందిలో పడ్డాడు. "ఏమిటీ విషయం తేల్చదు," అనుకున్నాడు కొన్ని రోజులు. "ఇలాగే బావుందిలే" అనుకున్నాడు మళ్ళీ. కానీ ఇంట్లో ఒత్తిడి పెరిగింది. అతని అమ్మకి కోడలు కావాలంది. అతని నాన్న వంశోద్ధారకుడు కావాలంటున్నాడు. చెల్లెళ్ళకి పెళ్ళిళ్ళయిపోయి పెద్ద పెద్ద పొట్టలతో తిరుగుతున్నారు. స్నేహితులు పిల్లల్ని స్కూళ్ళకి దిగబెడుతున్నారు. ఎంత కాలం ఇలా? ఎలా ఇంతకాలం?

ఆవిడమ్మ మొదటిసారి కాస్త ఇబ్బందిగా చూసింది.

"నాకు పెళ్ళి ఇష్టం లేదు," అంది.

నాగరాజు పాపం నిజంగా అదిరిపోయాడు.

"నేనంటే ఇష్టం లేదా?" అడిగాడు గారంగా.

ఆవిడమ్మ నవ్వింది.

"పెళ్ళంటే లేదు" అంది.

"ఏం?" అడిగాడు గోముగా

"నాకు అవన్నీ ఇష్టం లేదు. నాకు పిల్లలొద్దు" అంది.

నాగరాజు ఆశ్చర్యపోయాడు.

"తల్లి కావాలని ప్రతి ఆడదీ కోరుకుంటుంది


# మోనికా బుక్స్

**ఒకే ఒక్కడు**
(ఎన్.టి.ఆర్. జీవితకథ)
వెల 150 రూపాయలు

**విశ్వవిహారం**
(యాత్రా రచన)
వెల 60 రూపాయలు

**ఐ.వి.ఆర్.-రాజసూయం**
(ఉలుకు-పలుకు వ్యాసాల సంకలనం)
వెల 75 రూపాయలు

విశాలాంధ్ర బుక్‌హౌస్‌తో సహా ప్రముఖ పుస్తకాల షాపులలో ఇవి లభిస్తాయి. పోస్టు ద్వారా తెప్పించుకోదలచిన పాఠక మిత్రులు పుస్తకం విలువను ఎం.ఓ. లేదా డి.డి. రూపంలో ఈ క్రింది అడ్రసుకు పంపండి. పోస్టేజి ఉచితం.

మోనికా బుక్స్
79బి, జర్నలిస్ట్స్ కాలనీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33.

కదా," అన్నాడు అలాగే చూస్తూ. ఆవిడమ్మ మళ్ళీ నవ్వింది, కాస్త గట్టిగా.

"క్లాసుకి టైమైపోతోంది బాబూ! నే వెళ్ళాలి!"

అనేసి వెళ్ళిపోయింది. నాగరాజు కాలేజీలో రావి చెట్టు కింద ఒంటరిగా ఉండిపోయాడు. అతనికి తనకి జ్ఞానోదయం అయినట్టు అనిపించిందట. నిజానికి నాగరాజుకి కూడా పెళ్ళీ గిళ్ళీ ఇష్టం లేదు. హాయిగా ఏ బాదరబందీ లేకుండా ఆవిడతో... ఓహ్! ఇంట్లో పోట్లాడి, తల్లితండ్రుల్ని ఎదిరించి, బంధువులని ఒదులుకుని ఆవిడమ్మ దగ్గరికి వచ్చేశాడు.

'అందాలా ఆనందం ఇంతేనయ్యా, అందం చూడవయ్యా, ఆనందించవయ్యా డం డం డండడమ్'

జీవితం హాయిగా ఉందిట నాగరాజు కిప్పుడు.

ఆవిడమ్మకి ఎలా ఉందో ఎవ్వరికీ తెలీదు. దాదాపుగా అందరూ 'దానికేం?' అనుకున్నారు. కొందరు మాత్రం "ఆవిడకేం?" అనుకున్నారు.

కానీ, వెధవది, నాగరాజు నిత్య ప్రేమికుడు. వయసా పెద్దది కాదు. మనసా చంచలం. ఫేవరిట్ రైటరా, చలం. అందుకే వసుధని ప్రేమించాడు. వసుధ నున్నటి, నగిషీ పెట్టిన టేకు తలుపు రంగులో ఉండేదిట. ఆమెకి కూడా నాగరాజంటే ఇష్టం ఏర్పడింది. కానీ ఒక్క షరతు.

"నువ్వు నా వాడివి! ఎప్పటికీ నా వాడివి! అంతే!" అంది ఓ రాత్రి ఆవేశంగా నాగరాజు చెంప కొరుకుతూ.

నాగరాజు గొంతులో పడిన పచ్చి వెలక్కాయ రాయిగా మారి గుండెల్లోకి జారింది. ఆ రాయి మర్నాటికి పశ్చాత్తాపాగ్నిలో కరిగి కన్నీరై ప్రవహించింది. ఆవిడమ్మ ముందు మోకరిల్లేలా చేసింది.

ఆవిడమ్మకి అర్థం కాలేదు.

"ఏమైంది, రాజూ?" అంది.

నాగరాజు నెమ్మదిగా తేరుకున్నాడు. కానీ మాట పెగల్లేదు. కళ్ళు పైకి లేవలేదు. ఆవిడమ్మ రెండు అరచేతులతో అతని ముఖం ఎత్తింది.

## ఎగిరిపోకే ఎంగిలాకు!

ఎన్ని ఉషస్సులు
ఎన్నెన్ని వత్సరాలు
చైత్రానికి చైతన్యం వచ్చి
వేల వసంతాలు గడిచిపోయాయి.

రెక్కలార్చుకుని బక్క పేగులు
దిక్కులు వెదుకుతూనే ఉన్నాయి
వాళ్ళ కోసం ఎంగిలాకులు
త్యాగనిరతిని చాటుతున్నాయి.

కళ్ళన్నీ విస్తళ్ళు చేసుకుని
కడుపు నిండిన వారి ఎంగిలాకును
పేద పేగులు కెలుకుతున్నాయ్

మంచైనా... చెడైనా
పెళ్ళయినా ... పెద్ద కార్యమైనా
ఎంగిలాకులు వాళ్ళ విందు

అందుకే నిత్యం మొక్కుతారు
గాలి దేవుణ్ణి... ఎంగిలాకును ఎగిరిపోనీయకని.

వేడుకొంటారు వేలసార్లు భూదేవిని
ధూళితో ఎంగిలాకును కప్పేయకని.

మోకరిల్లుతారు వరుణుడి ముందు
కడుపు నింపే ఎంగిలాకును
నిర్దయగా వానతో కడిగేయకని!

వాళ్ళ గుండె నిండా కృతజ్ఞత..
కళ్ళ నిండా కోటి కాంతులు
చెత్తకుండీలో చిలుకు పలుకు
ఎంగిలాకులు పడేసే వాళ్ళంటే!

వాళ్ళకు గిట్టని దొక్కటే
బఫే ప్లేటంటే...!
వాళ్ళ కంటి ముందు శత్రువ దొక్కటే

ఎందుకంటే... వేసే ఓటు కన్నా...
వారి కడుపు కొట్టేది
ఆ ప్లేటొక్కటే...!

– పండా నాగేంద్ర త్రినాధ్

"ఏమైంది?" అంది మెత్తగా మల్లెపువ్వులాగా.
అయినా సరే, మాట పెగల్లేదు.
"నా దగ్గర దాపరికమా" అంది.
ఊహు! నాగరాజు దహించుకుపోతున్నాడు.
"ఎవరినైనా ప్రేమించావా?" అంది, కనబడీ కనబడని చిరునవ్వుతో. నాగరాజు గుండెలో మంట ఆరిపోయింది. హాయిగా అనిపించింది. చల్లటి గాలి వీచింది.
కళ్ళెత్తి ఆమె ముఖంలోకి చూశాడు.
"నాకు వసుధ గురించి తెలుసు" అంది.
'ఎలా?' అని అడగలేదు నాగరాజు. 'ఎలా అయితే మనకెందుకూ గొడవ' అనుకున్నాడు.
"నేనంటే అసహ్యంగా ఉంది కదా!" అన్నాడు.
"ఎందుకూ?" అంది.
"అబ్బ కరెక్ట్‌గా నేననుకున్నట్టే అంది" అనుకున్నాడు నాగరాజు.
"ఎందుకేమిటి! నాకూ, వసుధకీ...."
"నీకు వసుధంటే ఇష్టం కద," అడిగింది.
ఏం చెప్తాడూ, పాపం! మగాడూ, వెర్రివాడూ ("మా అబ్బాయి ఒత్తి వెర్రాడు. వెంగళప్ప" అనేది నాగరాజు అమ్మ)
"నీ అంత కాదు" అన్నాడు.
ఆవిడమ్మ నవ్వింది. ఆవిడ నవ్వు తూటా నవ్వు.
"నీకెలా తెల్సు" అంది.
"తెలుసు, అంతే!" అన్నాడు.
"మరి, సరే! నీకేం కావాలి?" అడిగింది.
"అలా అడిగితే ఏం చెప్తాను? నాకే తెలీదు." అన్నాడు.
"వసుధతో ఉంటావా వెళ్ళి?" అడిగింది.
నాగరాజుకి చలం 'మైదానం' గుర్తొచ్చింది. 'ఎంత గొప్పగా రాశాడు' అనుకున్నాడు.
"అలా కాదు. వసుధకి నేను ఇంకోళ్ళతో ఉండడం ఇష్టం లేదు" అన్నాడు.
ఆవిడమ్మ నెమ్మదిగా కుర్చీలో కూర్చుంది.
"ఆహా!" అంది.
నాగరాజు కాసేపు మౌనంగా ఉండిపోయాడు.
ఆవిడమ్మ కుర్చీలోంచి లేచి కిటికీ దగ్గరకెళ్ళి నించుంది బయటకి చూస్తూ.

నాగరాజు ఆమె దగ్గరికెళ్ళి తనూ నిలబడ్డాడు. ఆవిడమ్మ అతనికేసి చూసి నవ్వింది, చిన్నగా.
"ఏం చేద్దాం" అంది.
"నాకు తెలుసు నీకు ఈర్ష్యగా ఉందని" అన్నాడు.
"నాకెలా ఉందో చెప్పకోయ్," అంది నవ్వుతూనే.
"ఊరికే అలా నవ్వుతావేంటి పేద్ద యోగిలాగా! నీకిదో అలవాటు! ప్రతి దానికీ ప్రశాంతంగా నవ్వుతున్నట్టు మొహం పెట్టి అన్నిటికీ అతీతంగా ఉన్నట్టు నటించడం. నాకసహ్యం ఆ నవ్వంటే," ఎడాపెడా అనేశాడు కోపంగా.
"నీ సంగతి చెప్పు ముందు! నా గురించి చెప్తావెందుకూ?" అంది.
"నీకు ఈర్ష్యగా లేదా?" అడిగాడు కోపంగా.


# 'పత్రిక' చందా వివరాలు

కొందరు 'పత్రికా'భిమానులు చందా వివరాలు కావాలని ఉత్తరాలు రాస్తున్నారు. అలాంటి వారి కోసం-

| | |
|---|---|
| పత్రిక విడిప్రతి | : 5/- |
| ప్రత్యేక సంచిక (ఉగాది, దీపావళి) | : 10/- |
| సాలుసరి చందా | : 60/- |

మీ ఏడాది చందాను మోనికా పబ్లికేషన్స్ పేరిట ఎం.ఓ. లేదా హైదరాబాద్‌లో చెల్లించే విధంగా డి.డి. ద్వారా పంపండి! ప్రత్యేక సంచికలకు, పోస్టల్ ఛార్జీలకు కాగల అదనపు వ్యయాన్ని చందా మొత్తంలో చేర్చడాన్ని పాఠకులు గుర్తించగలరు. దీనిని ప్రత్యేక రాయితీగా పరిగణించి, చందా మొత్తాన్ని వెంటనే ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.

**మోనికా పబ్లికేషన్స్**
79బి, జర్నలిస్ట్స్ కాలనీ, జూబ్లీహిల్స్,
హైదరాబాద్-33.

"లేదు. ఏం?" అంది.

"ఏమిటీ, నేను వేరే ఆవిడతో తిరిగొస్తే నీకు ఈర్ష్యగా లేదా?"

"తిరిగొస్తే అసహ్యమేసేదేమో. నువ్వు ప్రేమించానన్నావు మరి?"

నాగరాజుకి గుక్క తిరగలేదుట. దాంతో అహం పాపం రెక్కలు విప్పి రెపరెపలాడిందట.

"నేను నీతో తిరిగానో ప్రేమించానో మరి నీకెలా తెల్సు?" అడిగాడు కసిగా.

"అది నీకు తెలియాలి. నాకు తెలిసి నాకు నువ్వంటే చాలా ఇష్టం" అంది ఆవిడమ్మ.

"ఎందుకు?" అన్నాడు తెలివిగా.

"చచ్చు ప్రశ్నలెయ్యకు," అంది. అయినా ముఖంలో కోపం లేదు. 'యోగి ముండ!'.

"అదేం చచ్చు ప్రశ్న కాదు," అన్నాడు.

"వసుధని అడిగినా అదే అంటుంది," అంది ఆవిడమ్మ.

"వసుధకి నేనంటే చాలా ఇష్టమని నాకు తెలుసు. నువ్వు చెప్పక్కర్లా" అన్నాడు.

"ఎలా?" అంది.

"నాకు తెలుసు. అంతే" అన్నాడు.

ఓ రెండు నిమిషాలాగి,

"వసుధ నీలాగా అయోమయం కాదు. తనకేం కావాలో బాగా తెలుసు ఆమెకి" అన్నాడు.

"నేను వేరే వాళ్ళతో తిరిగితే నీకు ఈర్ష్యగా ఉంటుందా?" అంది 'తిరిగితే' అనే మాటని ఒత్తి పలుకుతూ.

"ఎందుకుండదు. అది సహజం. నీ స్థానంలో నేనుంటే నాగరాజుని చంపేసే వాణ్ణి" అన్నాడు ఆవేశంగా.

"చూశావా, నా స్థానంలో నేనుండడం ఎంత మంచిదైందో! బతికిపోయావ్" అంది నవ్వుతూ.

నాగరాజుకి ఉక్రోషం పొంగిపోయింది.

"ఒక్క విషయం చెప్పు! గుండెల మీద చెయ్యేసుక్కుని, ప్రమాణం చేసి, నువ్వు ఇంకెవ్వరితోనూ పడుకోలేదని చెప్పు" అన్నాడు.

నాగరాజు చెంప ఛెళ్ళుమంది. కళ్ళు తిరిగాయి ఒక్కసారి. తేరుకోబోతుంటే ఇంకోసారి ఛెళ్ళుమంది. నాగరాజు తూలాడు. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆవిడమ్మ మసగ్గా మారి నెమ్మదిగా స్పష్టమైంది. ఆవిడ ముఖంలో కోపం ఎప్పుడూ చూళ్ళేదు కాబట్టి ఆవిణ్ణి గుర్తు పట్టలేకపోయాడు. పైగా తాను ఏడుస్తున్నట్టు అర్థమైంది. ఆవిడమ్మ ఏడవట్లేదని కనబడింది.

"నువ్వు రాయివి. నేనిలా ఏడుస్తుంటే నీకు కన్నీళ్ళు కూడా రావట్లేదు" అన్నాడు వెక్కుతూ.

"నేనెప్పుడు ఏడవాలో నువ్వు చెప్పకు. పో" అంది తలుపు చూపిస్తూ. ఆమెని ఆ భంగిమలో శిల్పంగా చెక్కొచ్చు అనిపించిందట ఎక్కడో నాగరాజుకి. కానీ అహం. ఊరుకోదే. విసురుగా బయటకెళ్ళి పోయాడు. నెమ్మదిగా తలుపేసేసిందిట ఆవిడమ్మ.

అంతే. ఆ తర్వాత ఆవిడమ్మ ఒంటరిగానే ఉండిపోయిందట. అంటే ఉండిపోయిందనే అందరూ అనుకుంటూ వస్తున్నారు. (ఆశ్చర్యం, అందరూ అలా అనుకుంటూనే 'అబ్బో' అంటుంటారు) అదే ఇంట్లో. అదే డాబాలో. ఆ కుండీలూ, గ్రిల్లూ, లతలూ, హాయిగా ఒక్కర్తే. ఏ బాదరబందీ లేకుండా.

అసలీ కథ ఎందుకు రాయబుద్ధయిందంటే, నిన్న సాయంత్రం ఆవిడమ్మ ఇంటి మీద నించి వెళ్తుంటే కుండీలో పూసిన పువ్వొకటి రాలి, కింద గోడ మీద పడి రోడ్డు మీద పడింది. పైన కుర్చీలో కూర్చుని చదువుకుంటున్న ఆవిడమ్మ అది చూసింది. నేనూ చూశాను. ఆవిడ చూడ్డం కూడా చూశాను. పరిగెత్తుకెళ్ళి ఆ పువ్వు తీస్కెళ్ళి పరిగెడుతూ మెట్లెక్కి ఆవిడ దగ్గరకెళ్ళి ఇచ్చాను. ఆవిడ అది తీస్కుని నావైపు చూసి నవ్వింది. ఆ నవ్వు అందం నేను చెప్పలేను. ఏం చెయ్యాలో తెలీక ఇదిగో ఇది రాశాను. చెప్పే ముక్కేమిటంటే నాకు ఆవిడమ్మంటే ఎందుకో చాలా ఇష్టం. ○

## ఎన్నికల రామాయణం

నిల్చె

పంచె

గెల్చె

– వై.కె. మూర్తి